

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

సజన్ రే ఝూట్ మత్ బోలో

ఖుదా కే పాస్ జానా హై

న హాథీ హై న ఘోడా హై

వహా పైదల్ హీ జానా హై

'తీస్రీకసం ' సినిమాలో శైలేంద్ర రచించిన ఈ గేయం శైలేంద్రను 'సినీ గేయ కబీర్ ' గా నిలిపింది. ఫణీశ్వర నాథ్ రేణు రచించిన కథ 'మారేగయే గుల్ఫామ్' చదివి శైలేంద్ర ప్రభావితుడయ్యాడు. ఆ కథ ఆధారంగా సినిమా నిర్మించాలని నిశ్చయించుకున్నాడు. ఫణీశ్వరనాథ్ రేణుతోనే స్క్రిప్టు రాయించాడు. ఎంతమంది వారించినా వినకుండా సినిమాను రూపొందించాడు. కథలోనే చక్కటి పాటలకు చిక్కటి సందర్భాలున్నాయి. ఫణీశ్వరనాథ్ రేణు రాసిన పల్లవులను (అధికశాతం జానపదులు పాడుకునే పాటలు) వాడుకుంటూ పాటలను రూపొందించాడు అత్యద్భుతమైన సినిమాకు అత్యద్భుతమైన పాటలు కుదిరి ''తీస్రీకసం' ఒక మరపురాని అత్యద్భుతమైన సినిమాగా, క్లాసికల్‌గా, సినీ అభిమానులు తప్పనిసరిగా పఠించాల్సిన పాఠ్య పుస్తకంలా ఎదిగింది. తీస్రీకసం సినిమాలో పాటలు వింటూంటే ఎందుకని ఆనాటి పాటలు ఈనాటికీ అలరిస్తాయో, ఈనాటి పాటలు క్షణాలలో ఆవిరైపోతాయో అర్థమవుతుంది. సందర్భపరంగా చూస్తే పై పాటకు సందర్భమేలేదు. కానీ శైలేంద్ర పాటలో పొదిగిన ఆ భావాలు ఇక దేన్నీ పట్టించుకోనీయవు. ఈ పాటకు శంకర్ జైకిషన్ బాణీ కూర్చిన విధానం, వాయిద్యాల అమరిక పాటను పరమోత్కృష్టమైన స్థాయిలో నిలుపుతాయి. రాజ్‌కపూర్ నటిస్తూండటంతో ముఖేష్ పాటపాడటం స్వాభావికం. దాంతో తాత్విక పరమైన భావాలున్న ఈ పాటలోని పదాలకు ముకేష్ స్వరంలోని మాధుర్యం, అలవికాని విషాద భావన స్వరంలో పలకటం మరింత లోతును ఇచ్చాయి. పాట సూటిగా ఎదలోతుల్లోకి దూసుకుపోతుంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ప్రతివ్యక్తి పాటలోని భావాన్ని అనుభవించి స్పందించగలగటం, పాటలో ప్రదర్శించిన విషయాలు ప్రతివ్యక్తి అంతరంగాన్ని తట్టిలేప గల శక్తిని కలిగి ఉండటం.

ప్రియుడా/స్నేహితుడా, అబద్ధాలాడకు. భగవంతుడికి జవాబుదారీ మనం. భగవంతుడిని చేరేందుకు దొడ్డిదారులు లేవు. ఏనుగులు, గుర్రాలు లేవు . అందరూ కాలినడకన వెళ్లాల్సిందే. ఇదీ పల్లవి భావం. ఇక్కడే పాటను శైలేంద్ర రచించిన విధానంలోని గొప్పతనం దాగుంది. ప్రతిపదార్థం తీసుకుంటే పాట భావం అర్థమయిపోతుంది. భారతీయులకు ఆధ్యాత్మికభావాలను ప్రత్యేకంగా బోధించాల్సిన పనిలేదు. ప్రతి ఒక్కరి రక్తంలో ఆధ్యాత్మిక భావాలు పరుగులు తీస్తూంటాయి. నిరక్షరాస్యుడు సైతం 'ఏం చేస్తాం?ఖర్మ' అంటాడు. 'భగవంతుడే ఇలా రాసిపెడితే ఎవరేం చేయగలరు?' అంటాడు. దాన్ని పలువురు పరాజితుడి మనస్తత్వంగా అర్థం చేసుకుని విమర్శిస్తూంటారు. కానీ భారతీయ వేదాంతం నిర్వ్యాపారం బోధించదు. అది అత్యంత dynamic, action oriented philosophy '. అబద్ధాలు చెప్పకు. భగవంతుడికి జవాబుదారీ ' అవటంలో నిర్వ్యాపారం లేదు. పనులు చేయాలి. కానీ ధర్మబద్ధంగా చేయాలి. పరాయివాడి సొమ్ముని ఆశించటం నేరం. అది చేయకూడదు. ఎదుటివాడిని మోసం చేయకూడదు. అది అన్యాయం. నీది కాని దానికి ఆశపడకూడదు. అది అధర్మం.

**ఈశావాస్యం మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్!**

**తేన త్యక్తేనభుంజీథా మాగృధః కస్యస్విద్ ధనం ॥**

ఇది ఈశావాస్యోపనిషత్తు ఆరంభమంత్రం. ఈ ప్రపంచమంతా భగవంతుడితో ఆవరించి ఉన్నది. ప్రపంచ పరిత్యాగంతో నిన్ను నువ్వు పోషించుకో. ఎవరి ధనాన్ని ఆశించకు. పై మంత్రం భావాన్ని సామాన్యుడి భాషలోకి అనువదిస్తే, ఒక నిరక్షరాస్యుడయిన పల్లెవాడు పాడుకునే పదాలలో పలికిస్తే, శైలేంద్ర రాసిన 'సజన్ రే ఝూత్ మత్‌బోలో' గేయంలా ఉంటుంది. ప్రపంచమంతా భగవంతుడు ఆవరించి ఉప్పుడు ఎవరిని మోసం చేస్తారు? ఎవరిని అన్యాయం చేయగలుగుతాం? ఎవరికి అబద్ధం చెప్పి ఏం సాధిస్తాం? కాబట్టి అలాంటి ప్రయత్నాలు చేయాల్సిన అవసరంలేదు. భగవంతుడి దగ్గర 'షార్ట్‌కట్'లు లేవు. ఇప్పుడు మనకు అలవాటయిన రీతిలో ప్రత్యేక దర్శనాలు, వి.ఐ.పి దర్శనాలు 'అసలు'లో లేవు. కొసరులో ఉంటేదానికి ఫలితం అనుభవించాల్సి ఉంటుంది. పైగా అంతా ఆవరించి ఉన్నవాడి దగ్గర ఎలాంటి మోసాలు, అబద్ధాలు పనిచేయవు. అలాంటి పని చేయటం మూర్కత్వం. కాబట్టి 'సజన్ రే ఝూట్ మత్ బోలో, ఖుదాకే పాస్ జానా హై' సినిమాలో రాజ్‌కపూర్ పాత్ర, పోలీసులు వేటాడుతున్న దొంగను బండిలో ఊరుదాటిస్తుంది. దొంగను బండిలో దాచి తీసుకెళ్తూ పాడేపాట ఇది.

**తుమ్హారే మహల్ చౌబారే , యహీరహె జాయెంగె సారె**

**అఖడ్ కిస్ బాత్‌కి ప్యారే, యె సర్ ఫిర్ భీ ఝూకానా హై**

ఇదీ అందరికీ తెలిసిన తత్వమే.

**ధనాని భూమౌ పశువశ్చగోష్ఠే, నారీ గృహద్వారే జనః స్మశానే.**

**దేహశ్చితాయాం పరలోక మార్గే. కర్మానుగోగచ్ఛతి జీవ ఏకః**

సుప్రసిద్ధమైన విషయం ఇది. ధనధాన్యాలు, ఆస్తులు ఇక్కడే ఉండిపోతాయి. ఏదీ ఎవరూ వెంట తీసుకువెళ్లరు. పశువులు పశుశాలలో ఉండిపోతాయి. భార్య గృహద్వారం వరకే వస్తుంది. జనులు స్మశానం వరకే. దేహం చితిలో కాలిపోతుంది. ఎన్ని అలంకారాలు చేసినా, ఎంత గొప్పగా, ప్రేమతో పోషించినా, దేహం చితిలో కాలి బూడిద అవ్వాల్సిందే. కానీ పరలోకానికి వెంట వచ్చింది కర్మఫలం మాత్రమే. అందుకే 'సజన్ ఝూట్ మత్ బోలో, ఖుదాకే పాస్ జానాహై '. ఈ భావననే మహళ్లు, ఆస్తులు ఇక్కడే ఉండిపోతాయి. దేన్ని చూసుకుని గర్వం? భగవంతుడి ముందు శిరస్సు వంచక తప్పదు. అలాంటప్పుడు దేన్ని చూసుకుని గర్వం? దేనికోసం తాపత్రయం? కాబట్టి ఈ సత్యాన్ని దృష్టిలో ఉంచుకుని ధర్మబద్ధంగా, సత్కర్మలు చేస్తూ బ్రతకాలి.

ఇలాంటి పాట కేవలం సినిమాకే పరిమితంగా భావించటం కష్టం. పాటలో ఎంతో లోతైన భావాలు, అత్యంత సరళంగా, అతి సున్నితంగా సుందరంగా వ్యక్తమవటంతో పండితులు, పామరులు ప్రతిఒక్కరు పాటను విని ఆనందిస్తారు. వినగానే భావం మనసులో ప్రతిష్ఠితమౌతుంది. బాణీ, గాయకుడు, వాయిద్యాలు పాట ప్రభావాన్ని మరింత పెంచేందుకు తోడ్పడతాయి. పాటలో పదాలు తీసేస్తే మిగతావన్ని 'ఆత్మ' లేని శరీరంలా పనికిరానివిగా తోస్తాయి. పాత పాటలలో గేయరచయితల ప్రతిభ స్పష్టమయ్యేది ఇక్కడే. ఒక మాములు సందర్భంలో అసాధారణము, అమూల్యమైన, సార్వజనీన భావనలతో పాటను రూపొందించి వ్యాపార పరంగా లాభాలు ఆర్జించటమే కాదు కలకాలం ప్రజల హృదయాలను స్పందింపచేస్తూ చిరంజీవిలా నిలిచే గీతాన్ని రూపొందించి సామాజిక బాధ్యతనూ ఆ కాలంలో పాటలు నిర్వహించేవి. అది ఈకాలం నాటి పాటలలో లోపించింది.

గమనిస్తే శైలేంద్ర ఆస్తికుడు కాదు – అలాగని ధర్మవ్యతిరేకి కాదు. భారతీయ తాత్వికత, జీవన విధానంలోని ఔన్నత్యాన్ని గ్రహించినవాడు. అందుకే ఎక్కడా భగవంతుడన్న పదం వాడకుండా 'ఖుదా' అన్న పదంతో ఒక విశ్వసృష్టి కారుడిని (ఏ మతానికి చెందినవాడు కాదు) సూచిస్తూ గీతాన్ని రచించాడు.

**భలా కీజే భలా హోగా, బురా కీజే బురా హోగా**

**యహీ లిఖ్ లిఖ్ కే క్యాహోగా, యహీ సబ్ కుచ్ చుకానా హై**

ఇది అందరికీ సులభంగా అర్ధమయ్యే ఇంకా గొప్ప భావన. మంచిచేస్తే మంచి అవుతుంది. చెడు చేస్తే చెడవుతుంది. ఇది ఎన్నిమార్లు చెప్పి ఏం లాభం? ఇంత రాసి ఏం లాభం? చేసిన పనికి ఫలితం ఇక్కడే అనుభవించాల్సి ఉంటుంది. ఎలాంటి వివరణ అవసరం లేకుండా ప్రతి ఒక్క వ్యక్తికీ బోధపడుతుంది భావం. మనస్సులో నిలిచిపోతుంది.

**లడక్ పన్ ఖేల్‌మే ఖోయా**

**జవానీ నీంద్ భర్ సోయా**

**బుఢాపా దేఖ్ కర్ రోయా**

**యహీ కిస్సా పురానా హై..**

బాల్యం ఆటల్లో గడుస్తుంది. యవ్వనం నిద్రలో (ఆనందం, సౌఖ్యం) పోతుంది. వృద్ధాప్యంలో వెనక్కు తిరిగి చూసుకుంటే విషాదం మిగులుతుంది. ఇది అలవాటయిన పాత కథే. విన్నవారి హృదయం స్పందించకమానదు. మానవ జీవితంలోని కర్మ, విధి, వంటి విషయాలను స్పష్టం చేస్తూ తన జీవితాన్ని సక్రమంగా బ్రతకటాన్ని మించిన భగదార్చన మరొకటి లేదన్న భావాన్ని కలుగచేస్తుందీ చరణం.

ఇలాంటి పాట ఒక్కసారి వింటే చాలు జీవితాంతం మరచిపోవటం కష్టం పాటలోని భావం ఎంత సులభంగా బోధపడుతుందో, అంత లోతైనది . ఇలా భావాన్ని వ్యక్తపరచటం వల్లే శైలేంద్రను హిందీ సినీగేయ ప్రపంచంలో కబీరుతో పోలుస్తారు.

ఈ పాట వింటూంటే సాహిర్ లూధియాన్వీ రచించిన పాట గుర్తుకు వస్తుంది. నిజానికి శైలేంద్ర సరసన దీటుగా నిలబడగలిగిన గేయ రచయిత సాహిర్. సాహిర్ సరసన సగర్వంగా నిలుస్తాడు శైలేంద్ర. సాహిర్ కూడా దైవాన్ని నమ్మడు విధిని నమ్ముతాడు. కానీ ఇచ్ఛాశక్తితో వ్యక్తి విధిని ఎదుర్కొనగలడు అని నమ్ముతాడు. అలాంటి సాహిర్ భగవంతుడి గురించి పాట రాయాల్సి వచ్చినప్పుడు అత్యంత సుందరమైన గీతం రచించాడు. గీతంలో భగవంతుడి ప్రసక్తిరాదు. దైవం పొగడ్తలు రావు. దైవాన్ని 'ప్రభుత్వం'తో పోల్చి విధి గొప్పతనాన్ని చూపుతూ సకల జనులకు వేదాంత తత్త్వాన్ని బోధించే అతి సుందరమైన గీతాన్ని సరళంగా రచించాడు.

*(ఇది వచ్చే నెల)*

Post your comments